క్లుప్తంగా

లాకులకు మరమ్మతులు చేపట్టాలి

కాజులూరు: మండలంలో కోరంగి కెనాల్‌పై మంజేరు వద్ద ఉన్న లాకులకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత కొన్నేలుగా లాకుల తలుపులకు రంధ్రాలు, పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలో లెవిలింగ్ కోసం నిలబెట్టిన నీరు రంధ్రాల ద్వారా డ్రైన్‌లోకి పోతుంది. ఈ లాకులపై భాగంలో సుమారు పదివేల ఎకరాల ఆయకట్టు ఉందని లాకులు మరమ్మతుల కారణంగా నీరు వృథాగా పోయి ప్రతి ఏటా సాగునీటి ఎద్దడి తలెత్తుతందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం పరిస్థితుల్లో లాకులకు మరమ్మతులు చేపట్టడం వల్ల నీరు వృథాగా పోయి దళ్వా సాగులో ముమ్మందు నీటిఎద్దడి ఎర్పడుతుందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిస్కారానికి కృషి చేయాలని స్థానిక రైతులు గండి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి రామారెడ్డి తదితరులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి కంకణ సేవ



అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గీతా పారాయణ చేస్తున్న మహిళలు

కపిలేశ్వరపురం: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అంగరలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కంకణ సేవ పూజలు చేశారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మక శోభ నెలకొంది. మహిళా భక్తమండలి సభ్యులు హనుమాన్ చాలీసా, గీతా పారాయణ చేశారు. ఆలయంలో బుధవారం నిర్వహించే పుష్పోత్సవంతో షష్ఠి ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

అంగర, పడమర ఖండ్రిక గ్రామాల మహిళా కళాకారులు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టకుంది. స్వామిని కీర్తిస్తూ ఆలపించిన గీతాలకు అనుగుణంగా కోలాటం వేశారు.

నేటి నుంచి ‘ఉపాధి’ గ్రామ సభలు

కపిలేశ్వరపురం: గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహణలో భాగంగా మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ రవికిరణ్ తెలిపారు. 21న మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి సామాజిక తనిఖీ వేదిక నిర్వహిస్తామన్నారు. అందుకు ముందస్తుగా బుధవారం ఉదయం 10 గంటలకు తాతపూడి, మధ్యాహ్నం 12 గంటలకు కపిలేశ్వరపురం, సాయంత్రం 4 గంటలకు నాగుల చెరువు గ్రామాల్లో ఈ సభలు నిర్వహించనున్నామన్నారు. 12న అంగర, నల్లూరు, 14న వాకతిప్ప, పడమర ఖండ్రిక, నిడసనమెట్ట, 15న వెదురుమూడి, 16న మాచర, 17న టేకి, నేలటూరు, కాదరిలంక, 18న అచ్యుతాపురం, 19న కోరుమిల్లి, 20న వల్లూరు, వడ్లమూరు, అద్దంకివారిలంక, కాలేరు గ్రామాల సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహించనున్నట్టు ఏపీఓ వివరించారు.

86 పాడి పశువులకు వైద్య సేవలు



పాడి రైతులకు మందులు అందజేస్తున్న ఏడీ రామకృష్ణ, పశు వైద్యాధికారులు

కె.గంగవరం: అద్దంపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఏడీ ఓ. రామకృష్ణ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారులు డాక్టర్ జి.సురేష్‌బాబు, డాక్టర్ ఎం.కృష్ణార్జున్, డాక్టర్ పి.రామచంద్రరావు 48 పాడి రైతులకు చెందిన 86 పాడి పశువులకు వైద్య సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏడిద ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. పశు సంవర్ధక శాఖ విశ్రాంత డీడీ డాక్టర్ రామకోటేశ్వర రావు తల్లి మోటూరి అన్నపూర్ణ జ్ఞాపకార్థంగా రూ.10 వేలు విలువ చేసే మినరల్ మిక్చర్లను పాడి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సృష్టిలోనే ప్రథమ గ్రంథం భగవద్గీత

మండపేట: సృష్టిలో ప్రథమంగా వెలిసిన గ్రంథం భగవద్గీత అని ఆ గ్రంథంలోని సారాంశాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ ఉన్నత విలువలతో జీవించాలని హిందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు శేఖర్‌బాబు విజ్ఞప్తి చేశారు. గీతా జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని ద్వారపూడిలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి ఆశీస్సులతో త్రైత సిద్ధాంత భగవద్గీత, 100 అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. హిందూ జ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ భగవద్గీత పఠించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గీతలోని జ్ఞానాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించి ధర్మాధర్మాలను తెలియపరిచారన్నారు. ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత ప్రపంచ మానవులందరికీ ఉపయోగపడుతుందన్నారు. సేవాసమితి సభ్యులు లక్ష్మీ నారాయణ, విజయ్, లోహిత్, భరత్, జైరామ్, సూర్యకుమారి, శోభారాణి, సంధ్యారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దమ్ముకు చిన్న ట్రాక్టరే మేలు

- బహుళ ప్రయోజనాలు అవకాశం
- రెండోసారి దమ్ము చేయడం ప్రయోజనకరం
- శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన అవసరం
- రెండు నియోజకవర్గాల్లో 98,607 ఎకరాల్లో రబీ సాగు



చిన్న ట్రాక్టర్‌తో వరి చేనులో దమ్ము



కేవీఎన్ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: ఖరీఫ్ సాగు పూర్తయ్యింది. దిగుబడిలో తీవ్ర నష్టాన్ని చవి చూసిన రైతులు రబీ సాగుపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కౌలు రైతులు ఖరీఫ్‌లో కోల్పోయిన ఆదాయాన్ని రబీలో భర్తీ చేసుకోవాలని ఆశిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 98,607 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. రబీ సాగులో తొలి ప్రక్రియ అయిన దమ్మును చేసే విషయంలో నూతన పద్ధతులను అవలంబించాలంటూ కపిలేశ్వరపురం మండల వ్యవసాయ శాఖాధికారి కేఎన్‌వీ రమేష్‌కుమార్ చేస్తున్న సూచనలివీ...

తక్కువ లోతు దమ్ముతో ప్రయోజనాలెన్నో...

తక్కువ లోతు దమ్ము చేసిన చేలో రైతులు తమ కాళ్లు లోతుగా దిగకపోవడం వల్ల నడవడం సులభంగా ఉంటుంది. నాట్ల ప్రక్రియలో మూన లోతుగా వెళ్లడం వల్ల మూన త్వరగా వేర్లు వేసుకుంటుంది. 15 సెంటీమీటర్లు మాత్రమే లోతు ఉండడంల్ల ఎరువు సక్రమంగా మూనకు చేరుతుంది. మూన త్వరగా దుబ్బుగా మారడం వల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.

లోతైన దమ్ముతో ఇబ్బందులు

దమ్మును పెద్ద ట్రాక్టరులతో లోతుగా చేయడం వల్ల పలు సమస్యలు తలెత్తుతాయి. నాట్లు వేసేటప్పుడు మూన లోతుగా భూమిలోకి దిగుతుంది. మూన పైకి వచ్చేందుకే చాలా రోజులు పడుతుంది. రైతు పాదాలు లోతుల్లోకి దిగడంతో అధిక శ్రమ వెచ్చించాల్సి వస్తుంది.

చిన్న ట్రాక్టరు వినియోగం మేలు

చిన్న ట్రాక్టరుతో 15 సెంటీమీటర్ల లోతు దమ్ము చేయించుకోవడం సాగుకు మేలు. పెద్ద ట్రాక్టరు బరువు అధికంగా ఉండడంతో దమ్ము అడుగులోతు దిగుతుంది. చిన్న ట్రాక్టరుతో అవసరమైన మేర అయిన 15 సెంటీమీటర్లు లోతు పడుతుంది. సంప్రదాయ పద్ధతిని వీడి చిన్న ట్రాక్టరుతో దమ్ము మేలు.

రెండోసారి దమ్ము ప్రయోజనకరం

తొలి దమ్ము పూర్తయిన వారం తర్వాత మరో మారు దమ్ము చేసుకోవడం మంచిది. ఇటీవల రైతులు ఈ పద్ధతిని వీడుతూ ఒకేసారి దమ్మును పూర్తి స్థాయిలో చేయించేస్తున్నారు. దీనివల్ల గడ్డి సక్రమంగా కుళ్లదు. వరినాట్లు అయిన తర్వాత ఆ గడ్డి కుళ్లి గ్యాస్‌గా మారుతుంది. దీంతో దుబ్బు తయారీలో ఇబ్బందులెదురవుతాయి. మొదటి దమ్ములో ఎకరాకు 4 బస్తాల సూపర్ ఎరువు వేస్తే కాల్షియం, సల్ఫర్(గంధకం) మూలకాలు అందుతాయి. దీనివల్ల వేర్లు త్వరగా అభివృద్ధి చెందడానికి, గింజ పోసుకునే ప్రక్రియలో నాణ్యత పెరిగేందుకు, తద్వారా తూకంలో బరువు పెరిగేందుకు దోహదం చేస్తుంది.

వెదజల్లుతామంటే..

విత్తనాలు జల్లేందుకు 10 రోజులు ముందే తొలి దమ్ము చేయాలి. విత్తడానికి నాలుగు రోజులకు ముందు మరోసారి దమ్ము చేయాలి. సమానంగా దమ్ము చేసి మట్టి పేరుకున్న తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాల్వలు చేయాలి. మొలక బయటకు రాగానే పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా వెదజల్లాలి. లేదా డ్రమ్ సీడర్ ద్వారా నీటిని పూర్తిగా తీసివేసి కూడా విత్తవచ్చు. మొక్కలో మొదటి ఆకు విచ్చుకునే వరకూ (7 లేదా 10 రోజులు వరకూ) పంటకు ఆరుతడి అవసరం. వెదజల్లు పద్ధతిలో వరి సాగు వల్ల తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించవచ్చు.

రెండు నియోజకవర్గాల్లో రబీ సాగు ఇలా...

మండలం	వరిసాగు (ఎకరాలో)	రైతు సేవా కేంద్రాలు
మండపేట	16,192	24
రాయవరం	14,641	19
కపిలేశ్వరపురం	15,779	19
రామచంద్రపురం	18,128	21
కె.గంగవరం	15,656	23
కాజులూరు	18,211	23
మొత్తం	98,607	129

మాలల మహాగర్జన జయప్రదం చేయాలి

- మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ పండు అశోక్‌కుమార్
- మండపేటలో పోస్టర్ ఆవిష్కరణ



మాలల మహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

మండపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15న గుంటూరులో తలపెట్టిన మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అఖిలభారత మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ పండు అశోక్‌కుమార్ కోరారు. మాల మహానాడు నాయకులు పొలమాల సత్తిబాబు, నక్కా సింహాచలం, సన్నాల ధనరాజు ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 11వ వార్డు న్యూ కాలనీలోని ప్రకాశం మున్సిపల్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణే అజెండాగా ఈ నెల 15 సాయంత్రం 4 గంటలకు గుంటూరులోని నల్లపాడు వద్ద మాలల మహాగర్జన పేరుతో భారీ సభ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి మాలలు పెద్ద ఎత్తున ఈ సభకు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వర్గీకరణ అమలుకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షుడు ఎంఏకే భీమరావు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలం, ఎస్సీ నాయకులు నాతి శ్రీనివాసరావు, విప్పర్తి సింహాచలం, యడ్ల రవి, కొమారపు సత్యనారాయణ, విహార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు, గర్భిణుల రక్త శాతం వివరాల నమోదు



లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులను పరీక్షిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీమ్

రాయవరం: ప్రధానమంత్రి సమగ్ర స్వస్థ యోజన కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ టీమ్ మంగళవారం మండలంలోని లొల్లలో తనిఖీ చేసింది. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో సచివాలయ పరిధిలోని ఏఎస్ఎంలు బాలికలు, గర్భిణులు, బాలింతల రక్తశాతం వివరాలను నమోదు చేశారు. మాతృ, శిశు మరణాలు తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు ప్రతి సచివాలయ పరిధిలో ఈ వివరాలు నమోదు చేశారు. ఇప్పటికే ఏఎన్ఎంలు నమోదు చేసిన వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అవసరమైతే తిరిగి రక్త పరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ణయించి, తదనుగుణంగా వారికి మందుల సరఫరా లేదా రక్త మార్పిడి చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి ఎస్.రవి తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి వీటిని హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ యాప్‌లో నమోదు చేశారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని బాలికలు, బాలింతలు, గర్భిణుల రక్తహీనత పరిస్థితిని పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ జిల్లా మేనేజరు ఎస్‌టీపీ కృష్ణమోహన్, ఏఎన్ఎలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

హింస లేని సమాజాన్ని నిర్మిద్దాం



ఆలమూరులో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రవికుమార్

ఆలమూరు: వివక్షకు తావులేకుండా హింసలేని సమాజాన్ని నిర్మిద్దామని, మానవ హక్కులను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని ప్రముఖ హోమియో వైద్యులు, మానవ హక్కుల పరిరక్షణ నేత చల్లా రవికుమార్ అన్నారు. ఆలమూరులో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. సమత స్వచ్ఛంద సంస్థ కార్యాలయం ప్రాంగణంలో చైర్మన్ జె.యేసురాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డాక్టర్ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎందరో మహనీయుల పోరాటాల ద్వారా సాధించుకున్న అనేకమైన హక్కులు ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి కారణాల వల్ల కాలగర్భంలో కలిసి పోతున్నాయని ఆవేదన చెందారు. నేటి సమాజంలో బానిస వ్యవస్థ ఇంకా మారలేదని, వేర్వేరు రూపాల్లో ఇంకా కనబడుతుందంటూ చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలను ఉదాహరణల ద్వారా ఆయన వివరించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామ సర్పంచ్ నేలపూడి లావణ్య, ఏజీపీ బూసి విద్యా ప్రసన్న, సమత ఫౌండర్ శామ్యూల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్, మానవహక్కుల సంఘ ప్రతినిధులు కెవి.రామారావు, సాయిబాబు, వనుం లక్ష్మణరావు, కె.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి పని భారం తగ్గించాలని వినతి



వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి దుర్గారావుదొరకు సమస్యలు వివరిస్తున్న జేఏసీ నాయకులు

రామచంద్రపురం రూరల్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి అనవసరపు పని భారం తగ్గించాలని కోరుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దుర్గారావు దొరను కలసి వినతిపత్రం అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు గురించి వాట్సాప్ గ్రూపులో అనుచితమైన వాయిస్ మెసేజ్‌లు పెట్టిన విషయాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వారిపై పనిభారం తగ్గించాలన్నారు. ఏఎన్ఎంలకు పెంచుతున్న యాప్‌లను తగ్గించాలని, పీహెచ్‌సీల్లో మినిస్ట్రీరియల్ స్టాఫ్ లేనిచోట్ల వెంటనే సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రపురం తాలూకా యూనిట్ అధ్యక్షుడు చిక్కాల సూర్యారావు, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మండపేట అధ్యక్షుడు జె.మల్లిఖార్జునుడు, ఈసీ మెంబర్ ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



శలపాకలో రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ భారతి



మారేడుబాక సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ తేజేశ్వరరావు, హాజరైన మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ



టేకిలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు



లొల్ల రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు ఐపీ శెట్టి

మండపేట మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ

మండపేట: ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులు రైతుల భూ సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తాయని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఓ రామకృష్ణ అన్నారు. రెవెన్యూ సదస్సులను మంగళవారం మండలంలోని మారేడుబాక, చిన ద్వారపూడి గ్రామాల నుంచి ప్రారంభించారు. మారేడుబాక సచివాలం వద్ద తహశీల్దార్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు రామకృష్ణ, దేవస్థానం ఈవో పీవీవీఎస్ కామేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన వినతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి , వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి చినద్వారపూడిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మారేడుబాక నుంచి 19, చినద్వారపూడి నుంచి 2 దరఖాస్తులు అందినట్టు డిప్యూటీ తహసీల్దార్ మెహెర్‌బాబా తెలిపారు. ఆర్ఐ పి. వాసంతి, మండల సర్వేయర్ సీహెచ్ సుజాత, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

కాజులూరు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహద పడతాయని డిప్యూటీ కలెక్టర్ డి.భారతి అన్నారు. మండలంలోని శలపాకలో మంగళవారం రెవెన్యూ సదస్సులను డిప్యూటీ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చుతగ్గులను సరిచేయడంతో పాటు ఇతర భూ సమస్యలను రెవెన్యూ అధికారులు సరి చేస్తారన్నారు. ఉపాధిహామీ పథకం పీడీ అడపా వెంకటలక్ష్మి రైతులను ఉద్దేశించి ప్రసందించారు. తొలిరోజు కార్యక్రమంలో మ్యుటేషన్-4, కుటుంబ సభ్యుల ధృవపత్రలు-2 రీ సర్వే రిసన్స్-24, ఇతర సమస్యలపై ఒకటి దరఖాస్తులు వచ్చినట్టు ఆర్ఐ వేగేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు, వీఆర్వోలు గనికమ్మ, పట్టాబి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల స్వచ్ఛీకరణకు..

కపిలేశ్వరపురం: రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ లక్ష్యంతో రెవెన్యూ గ్రామ సదస్సులను నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో కామేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో మంగళవారం టేకి గ్రామంలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. గతంలో చేపట్టిన భూ సర్వే సందర్భంగా తలెత్తిన సాంకేతిక సమస్యలపై భూ యాజమానులు అర్జీలను అందజేశారు. వాటిని వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి, బి.వెంకటేశ్వరరావు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డీఎల్‌డీఓ కామేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా రూపొందిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జానకిరామయ్య, ఆర్ఐ అర్జమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లొల్లలో...

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామానికి చెందిన పలువురు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అడంగల్ సవరణలు చేపట్టాలంటూ ఆరు, మ్యుటేషన్స్ కోరుతూ మూడు, ఎక్స్‌టెంట్ వేరియేషన్‌పై రెండు వినతిపత్రాలు వచ్చినట్టు తహసీల్దారు శెట్టి తెలిపారు. గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంబికపల్లి అగ్రహారం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ అఖిల

అంబికపల్లి అగ్రహారంలో..

రామచంద్రపురం రూరల్: అంబికపల్లి అగ్రహారంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ దేవరకొండ అఖిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో 10 అర్జీలు వచ్చాయని డిప్యూటీ తహశీల్దార్ వరసాల మాధురి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవప్రసాద్ ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్, వీఆర్ఓ కడలి రాము, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మండపేటలో మానవ హక్కుల దినోత్సవం



వలంటీర్లతో కలసి మానవ హక్కులపై అవగాహన కల్పిస్తున్న టౌన్ ఎస్ఐ శాస్త్రి

మండపేట: పట్టణంలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డులోని బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న దుకాణదారులు, ఆటో డ్రైవర్లకు మానవహక్కులపై ఆలమూరు పారా లీగల్ వలంటీర్స్ (పీఎల్‌వీ) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి కూడా హాజరై మానవ హక్కుల ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ జీవించే, మాట్లాడే హక్కు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వాటిని తెలుసుకుని స్వేచ్ఛగా జీవించాలని సూచించారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే వారికి న్యాయం చేయడానికి మానవహక్కులు దోహద పడతాయన్నారు. అనంతరం డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉత్తర్వుల మేరకు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉచిత న్యాయ సేవల ఫ్లెక్సీని ఏఎస్ఐ చిన్నారావు సమక్షంలో ఏర్పాటు చేసినట్టు పీఎల్‌వీ పెనుముచ్చి సుకుమార్ తెలిపారు.

కొనసాగుతున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె



సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

మండపేట: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తలపెట్టిన సమ్మె మండపేటలో మంగళవారం రెండో రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది కార్యాలయం ఎదురుగా టెంట్ వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ మొర ఆలకించాలని వేడుకున్నారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చి అండగా నిలవాలని కోరారు. సమ్మెలో యూనియన్ నాయకులు పాలపర్తి సుబ్బారావు, యాదాల తాతారావు, సభ్యులు కప్పల అన్నవరం, సవరపు సంతోష్, పిట్టా ప్రవీణ్ ,ఈరిల్లి విజయ మోహన్, ఖండవల్లి రాజు, మోటుపల్లి వెంకటేశ్వరరావు, ,గుండుపల్లి వీరప్రసాద్, వాసంశెట్టి వాసు, కొండేపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆయన కళ్లు సజీవం



మాజేటి శ్రీరామ చంద్రమూర్తి (ఫైల్)

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన మాజేటి శ్రీరామచంద్రమూర్తి (64) నేత్రదానం ఇరువురు అంధులకు చూపు ఇవ్వనుంది. అనారోగ్యంతో ఆయన మంగళవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన మెగా రక్తదాత మానేపల్లి శివకుమార్ అవగాహన కల్పించడంతో నేత్రదానం చేసేందుకు శ్రీరామచంద్రమూర్తి కుటుంబ సభ్యులు అంగీకరించారు. జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి ద్వారా కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు సమాచారం అందించారు. దీంతో ఐ బ్యాంకు సాంకేతిక సిబ్బంది వచ్చి శ్రీరామచంద్రమూర్తి నేత్రాల నుంచి కార్నియా సేకరించి తీసుకుని వెళ్లారు. నేత్రదానం చేయాలనుకునే వారు 9866436694 నంబరుకు సంప్రదించాలని ఫణికృష్ణారెడ్డి కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ద్రాక్షారామ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న మలేరియా అధికారి డాక్టర్ ఆశ

రామచంద్రపురం రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ డి.ఆశ వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్. ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షల గురించి ల్యాబ్ టెక్నీషియన్ మాణిక్యాంబ నుంచి వివరాలు సేకరించారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి రోగులను గుర్తించాలని వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జోన్-2 ఎంపీహెచ్‌ఈఓ రవిశేఖర్, సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మలికిపురం మండలం లక్కవరం గ్రామస్తులు ఆదుర్తి శివాజీ వెంకటరమణ దంపతులు మంగళవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.